క్లుప్తంగా

మహిళల రక్షణే ధ్యేయం

నెహ్రూనగర్: మహిళల రక్షణే ధ్యేయంగా ఢిల్లీ కేంద్రంగా దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఏర్పాటు చేసినట్లు జిల్లా అధ్యక్షురాలు కటారి రమాదేవి తెలియజేశారు. ఫౌండేషన్ సభ్యులతో కలసి ఎస్పీ ఆరీఫ్ హఫీజ్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ఫౌండేషన్ చేస్తున్న కార్యక్రమాల్ని ఎస్పీకి వివరించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళల కోసం పలు సేవా కార్యక్రమాల్ని నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు విజయకుమారి, మేరి సరోజిని, లక్ష్మి, పార్వతి, మరియమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు సిరంజ్‌లు, మాస్కులు అందజేత



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అభివృద్ధికి వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. జీజీహెచ్ పిల్లల వైద్య విభాగాధిపతి డాక్టర్ పద్మలత, డాక్టర్ మోహన్ చంద్ర, డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ రమేష్‌కుమార్, డాక్టర్ వీరేశ్వర రావు, డాక్టర్ రవీంద్రనాయక్ బుధవారం సిరంజ్‌లు అందజేశారు. టీవీ చానల్ సిబ్బంది హరీష్, అశోక్‌కుమార్ మాస్కులు అందజేశారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



సంధ్య

గుంటూరు రూరల్: అనుమానాస్పద స్థితిలో యువతి మృతి చెందిన సంఘటన బుధవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. మేడికొండూరు మండలం పేరేచర్ల తెల్లక్వారీ కాలనీకి చెందిన తమ్మిశెట్టి రామకోటి, దుర్గ దంపతులు స్థానికంగా క్వారీ పనులు చేసుకుని జీవిస్తుంటారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. రెండో కుమార్తె సంధ్య (17) ఇంటర్ మొదటి సంవత్సరం వరకూ చదివి ప్రస్తుతం ఇంటి దగ్గరే ఉంటూ తల్లిదండ్రులతోపాటు అప్పుడప్పుడు క్వారీ పనులకు వెళుతూ ఉంటుంది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం కాలనీ సమీపంలోని క్వారీ వద్ద తీవ్ర గాయాలతో శవమై పడి ఉంది, స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలికి చేరుకుని విచారించగా, మృతురాలు సంధ్య అని తెలిసింది. తల్లిదండ్రులు, స్థానికుల ఆరోపణల మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ప్రేమ వ్యవహారంలో వివాదాలు జరిగాయా? కుటుంబ సమస్యలా? ప్రేమ వైఫల్యమా? హత్య చేశారా? ఆత్మహత్యకు పాల్పడిందా? ఏం జరిగిందనేది పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

బాల్య వివాహం చేయడం నేరం

ఎస్టీ కాలనీలో అడ్డుకున్న అధికారులు



ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రంలోని ఎస్టీ కాలనీలో బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. కాలనీకి చెందిన మైనర్ బాలుడికి, పాతమల్లాయపాలెం ఎస్టీ కాలనీకి చెందిన మేజర్ యువతికి వివాహం జరుగుతుందన్న సమాచారం ఐసీడీఎస్ అధికారులకు బుధవారం అందింది. దీంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.వి.రత్నం, చైల్డ్ రైట్స్ కమ్యూనిటీ రిసోర్స్ వర్కర్ రాజ్యలక్ష్మి, ఏఎస్ఐ శ్రీనివాసరావు బాలుడి ఇంటికి వెళ్లారు. తండ్రి ఆవుల చెంచయ్య, తల్లి వీరమ్మలతో మాట్లాడారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని వివరించారు. బాలుడికి 21 సంవత్సరాలు వచ్చే వరకూ వివాహం చేయడానికి వీల్లేదని తెలిపారు. ఈ మేరకు తల్లిదండ్రుల నుంచి లిఖిత పూర్వకంగా స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ వెంకటరత్నం మాట్లాడుతూ బాల్య వివాహానికి ఎవరు ప్రేరేపించినా శిక్షార్హులవుతారని తెలిపారు.

రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా కోదండరామిరెడ్డి

పెదనందిపాడు: స్థానిక రోటరీక్లబ్ 2023–24 సంవత్సరానికి నూతన కార్యవర్గంతో పాటు అధ్యక్షుడ్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రస్తుత అధ్యక్షుడు జాన్‌విక్టర్‌పాల్ తెలిపారు. అధ్యక్షుడిగా యన్నం కోదండరామిరెడ్డి, కార్యదర్శిగా యెలిశెట్టి రమణయ్య, కోశాధికారిగా ఎన్.వి.ఎస్. నాగేశ్వరరావుతో పాటు వివిధ విభాగాలకు డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నగరంలో కుండపోత



వర్షం నీరుతో నిండిన రైల్వే ఇన్‌స్టిట్యూట్ రోడ్డు



నెహ్రూనగర్: నగరంలో బుధవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం కూడా చల్లగా ఉంది. సాయంత్రం 4.30 గంటల తరువాత నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ముఖ్యంగా డొంక రోడ్డు మూడు వంతెనలు, అరండల్‌పేట, నెహ్రూనగర్, బ్రాడీపేట, కొరిటిపాడు, పాత గుంటూరు తదితర ప్రాంతాల వీధుల్లో నీరు నిలిచిపోయింది. వాహనదారులు, పాదచారులు అవస్థలు పడ్డారు. సాయంత్రం పనులు ముగించుకుని ఇంటికి వెళ్లే ఉద్యోగులు, చిరువ్యాపారులు ఇబ్బంది పడ్డారు.

నగరపాలక సంస్థ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి : కమిషనర్

నగరంలో మరో రెండు వర్షాలు పడే అవకావశం ఉందని వాతావరణ శాఖ సూచనల మేరకు నగరపాలక సంస్థ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. వర్షాల వల్ల డ్రెయిన్లు పొంగే ప్రాంతాల్లో ప్రజారోగ్య కార్మికులు, శానిటేషన్ కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఇంజినీరింగ్ సిబ్బంది అందుబాటులో ఉంటూ రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని బెయిల్ అవుట్ చేయాలని తెలిపారు. వర్షాలకు, గాలులకు విద్యుత్ సరఫరాలో సమస్య వచ్చినా తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా హెడ్ వాటర్ వర్క్స్, రిజర్వాయర్ల వద్ద ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారుల్ని కమిషనర్ ఆదేశించారు.



వర్షం నీరుతో నిండిన అరండల్‌పేట 1వ లైను



వర్షంలో తడుస్తున్న నగరవాసులు

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ బాలసుందరరావు

పట్నంబజారు: ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా మెలగాలని ఆ విభాగ డీఎస్పీ బాలసుందరరావు చెప్పారు. ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో బుధవారం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో ఆటోడ్రైవర్లు, వాహనాల యజమానులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లంతా తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని తెలిపారు. లైసెన్సు లేని డ్రైవర్లకు ఆటోను అద్దెకు ఇస్తే ఉపేక్షించమని యజయానులకు చెప్పారు. ఆటోల్ని ఇష్టానుసారంగా రోడ్డుకు అడ్డంగా ఆపి ప్రయాణికుల్ని ఇబ్బందులకు గురి చేయరాదని ఆదేశించారు. కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. రోడ్లపై ర్యాష్ డ్రైవ్ చేస్తూ కొంత మంది ఆటోవాలాలు ప్రమాదకర ప్రయాణం చేస్తున్నారని, ఇకపై అలాంటివారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. నాజ్ సెంటర్ పరిధిలో డీమార్ట్ వద్ద నో పార్కింగ్ జోన్‌గా గుర్తించినట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అతిక్రమించే వారిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. సమావేశంలో ఈస్ట్ ట్రాఫిక్ సీఐ నిసార్ బాషా, ఎస్ఐ హరిబాబు, సిబ్బంది, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

పైపులైన్ పనులతో అవస్థలు



నెహ్రూనగర్ 10వ లైనులో పూర్తిగా మట్టితో నిండిపోయిన ప్రధాన డ్రెయిన్



పొక్లెయిన్ దెబ్బకి విరిగిపోయిన మంచినీటి పైపులైన్లు

నెహ్రూనగర్: స్థానిక వాటర్ ట్యాంకుల నుంచి సంజీవయ్యనగర్ రైల్వే గేటు వరకు 800 ఎంఎం డయా పైపులైన్ స్థానంలో 900 ఎంఎం డయా పైపులైన్ పనుల్ని నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు చేపట్టిన విషయం తెలిసిందే. అయితే, పనుల వల్ల స్థానికులు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. పనులు దీర్ఘకాలంగా చేయడంతో పాటు నెహ్రూనగర్ 10వ లైను వద్ద ఉన్న డ్రెయిన్‌లో మట్టిని తీయకుండా వదిలేశారు. కాలువలో మురుగు పెద్దఎత్తున పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఆ ప్రాంతంలో వ్యాపార సంస్థలకు, ఇళ్లకు ఇచ్చిన ట్యాప్ కనెక్షన్ కూడా కట్ అయిపోయాయి. వాటిని పునరుద్ధరించడంలో అధికారులు కూడా వైఫల్యం చెందారు. దీనిపై ఏఈ అనూషను వివరణ కోరగా వీలైనంత త్వరగా కాంట్రాక్టర్‌తో మాట్లాడి మట్టి తీయించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

యూనిఫైడ్ సివిల్ కోడ్ ప్రయత్నాలను మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు

నెహ్రూనగర్: భారత పౌరుల్ని ప్రమాదంలో పడేసే విధంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేయ తలపెట్టిన యూసీసీ(యూనిఫైడ్ సివిల్ కోడ్) ప్రయత్నాల్ని మానుకోవాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు కోరారు. యూసీసీ అమలుకు వ్యతిరేకంగా అంకమ్మనగర్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మైనార్టీ మతాల్ని అణచివేస్తూ, దేశాన్ని ఆర్థికంగా కుంగదీసి, పరిపాలనలో విఫలమైన మోదీ కర్ణాటకలో ప్రజల దెబ్బను చవి చూశారని తెలిపారు. ఇప్పుడు యూసీసీ అంటూ దేశంలో వివిధ మతాలు కులాల మధ్య చిచ్చుపెట్టి అల్లర్లు సృష్టించేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. మణిపుర్‌లో లక్షలాదిమంది క్రైస్తవుల ఆస్తులు ధ్వంసం చేస్తూ ఉంటే మోదీ 50 రోజులుగా మౌనం పాటిస్తున్నారని ధ్వజమెత్తారు. అల్లర్లను అదుపు చేయకుండా క్రైస్తవ దేశాలకు వెళ్లి స్నేహాన్ని నటిస్తూ వచ్చారని ఆరోపించారు. యూసీసీ వద్దంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి లక్ష మంది క్రైస్తవ, ముస్లిం, బౌద్ధ జైన, మానవతావాదుల సంతకాలు సేకరించి భారత లా కమిషన్‌కు అందించనున్నట్లు తెలియజేశారు. ఈనెల 9న అన్ని చర్చిల వద్ద క్రైస్తవ సంఘాల చర్చి పాస్టర్ల సాయంతో యూసీసీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేయనున్నట్లు వెల్లడించారు. 14న క్రైస్తవ సంఘాల ప్రతినిధులతో న్యూఢిల్లీలోని భారత లా కమిషన్ కార్యాలయంలోని ప్రతినిధులకు వినతి పత్రం అందజేస్తామని తెలిపారు .సమావేశంలో క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మద్దు ప్రేమజ్యోతిబాబు, క్రైస్తవ సంఘ నాయకులు కందుల దీనమణిరాజు, మోపర్తి శ్రీను, ఆంథ్రూస్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో చిన్నారులకు బోధన



ప్రత్తిపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో విద్యను చిన్నారులకు అందిస్తున్నట్లు సీడీపీవో వి. సుజాతాదేవి అన్నారు. ప్రీప్రైమరీ-1, ప్రీ ప్రైమరీ-2 కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) డేను నిర్వహించారు. 0-6 సంవత్సరాలలోపు చిన్నారుల తల్లిదండ్రుల్ని కేంద్రాలకు ఆహ్వానించారు. పిల్లల సమగ్రాభివృద్ధికి తీసుకుంటున్న చర్యల్ని అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లులకు వివరించారు. పిల్లల మానసిక ఉల్లాసానికి ఇంటి వద్ద తీసుకోవలసిన చర్యల్ని తెలియజేశారు. ఆయా కార్యక్రమాలను సీడీపీవో పర్యవేక్షించారు.

రేషన్ బియ్యం పట్టివేత



రావిపాటివారిపాలెం (ప్రత్తిపాడు): అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. ప్రత్తిపాడు పంచాయతీ పరిధిలోని రావిపాటివారిపాలెంలో జనావాసాల మధ్యలో ఒక చిన్న రేకుల షెడ్డులో గుట్టుచప్పుడు కాకుండా రేషన్ బియ్యాన్ని నిల్వ చేశారన్న సమాచారం మంగళవారం ఉదయం ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్రబాబుకు అందింది. దీంతో ఆయన సిబ్బందితో కలసి షెడ్డు పై దాడి చేశారు. 13 తెల్ల గోతాల్లో నిల్వ చేసిన 6.40 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు రవాణాకు వినియోగిస్తున్న ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషనుకు తరలించారు. బియ్యం నిల్వ చేసిన ప్రత్తిపాడుకు చెందిన కుంభా కల్యాణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై సమాచారం అందించాలన్నారు. సమాచారమిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

నిర్ణీత సమయంలో సర్వే పూర్తి చేయాలి



పెదనందిపాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మొదలు పెట్టిన సమగ్ర భూ సర్వేను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ట్రైనీ డెప్యూటీ కలెక్టర్లు సాయిశ్రీ, వాణి సర్వేయర్లకు సూచించారు. బుధవారం సాయంత్రం పెదనందిపాడు వచ్చిన వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు రీ సర్వేకు సంబంధించిన సమస్యలున్న పక్షంలో వాటిని పరిష్కరించి, మేలు చేయడానికే ప్రభుత్వం ఈ సర్వే మొదలుపెట్టిందని తెలిపారు. దీనిపై అశ్రద్ధ వహించరాదని సిబ్బందికి స్పష్టం చేశారు. సర్వేయర్లందరికీ కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని, అనుకున్న సమయానికి పూర్తి చేయాలని, అందుకు ప్రతి ఒక్కరి సహకారం తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ సుభాని, సర్వే అధికారులు నాగశేఖర్, సత్యనారాయణ, మండల సర్వేయర్ ప్రసాద్, వివిధ గ్రామాల సర్వేయర్లు, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తక్కువ ఖర్చులో నానో ఎరువులు

ప్రత్తిపాడు: తక్కువ ఖర్చులో నానో ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు వీటిపై దృష్టి సారించాలని ఇఫ్కో జనరల్ మేనేజర్ ఎం. జగన్‌మోహన్ రెడ్డి సూచించారు. ప్రత్తిపాడులోని ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రంలో బుధవారం ప్రత్తిపాడు మ్యాక్స్ సొసైటీ ఆధ్వర్యంలో నానో ఎరువులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇఫ్కో జనరల్ మేనేజర్ ఎం.జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. నానో ఉత్పత్తుల వల్ల ప్రయోజనాల్ని వివరించారు. యూరియా, డీఏపీ బస్తాల స్థానంలో లిక్విడ్ రూపంలో బహిరంగ విపణిలో అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు వాటిని వినియోగించాలని ఆయన తెలిపారు. నానో ఎరువుల పిచికారీ సులభతరంగా ఉండేలా డ్రోన్లును కూడా రైతాంగానికి అందుబాటులో ఉంచనున్నట్లు జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. జీడీసీసీ బ్యాంకు ప్రత్తిపాడు బ్రాంచి మేనేజర్ సుధాకర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలోనూ విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని తెలిపారు. రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ, లాభసాటిగా వ్యవసాయం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో శశిధర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమం, అభివృద్ధి



స్థానికుల సమస్యలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

- మేనిఫెస్టోలో 99 శాతం హామీలు అమలు
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: సంక్షేమం, అభివృద్ధి ప్రతి గడపకు దరి చేర్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. నియోజకవర్గంలోని ఆరో డివిజన్ రైలుపేట, కొత్తపేట పరిసర ప్రాంతాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం వై.ఎస్.జగన్ అని కొనియాడారు. విద్య, వైద్యం, రైతన్న, మహిళలకు అండగా నిలబడి పేదల పక్షపాతినని చాటిచెప్పారని వివరించారు. రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమ పథకాల్ని ప్రజలకు చేరువ చేసి 99 శాతం హామీల్ని నెరవేర్చిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌దేనని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తిరిగి మరో మారు వైఎస్సార్ సీపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళ నేత నూరి ఫాతిమా, ఆరో డివిజన్ ఇన్‌చార్జి గొలుసు చంద్రశేఖర్, పార్టీ స్థానిక నేతలు షేక్ షరీఫ్, జాఫర్‌ఖాన్, నూర్ అహ్మద్, దుర్గాప్రసాద్, మునిరత్నం, బొందలపాటి ప్రసాద్, విశాలాక్షి, పార్టీ ముఖ్యనేతలు, అధికారులు పాల్గొన్నారు.

పక్కాగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణ

ఇంజినీరింగ్ అధికారుల సమావేశంలో కమిషనర్ కీర్తి చేకూరి



ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా నగరంలో చేపట్టిన గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు (జీటీఎస్), ఈ–ఆటోల చార్జింగ్ పాయింట్స్ నిర్మాణ పనుల్ని వేగంగా చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో గుర్తించిన ప్రాంతాల్లో జీటీఎస్‌ల నిర్మాణాల్ని ఈఈలు బాధ్యతగా తీసుకొని వేగంగా చేపట్టాలని ఆదేశించారు. వార్డు సచివాలయాల వారీగా ఈ–ఆటోలు అందుబాటులోకి వచ్చినందున వాటికి అవసరమైన చార్జింగ్ పాయింట్స్‌ను పరిసరాల్లో ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రతి ఆటోకు జీపీఎస్ ఏర్పాటు చేసి, రోజూ ట్రిప్పుల వివరాల నివేదిక ఇవ్వాలని తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజారోగ్య విభాగంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వంలో ఆమోదించిన అభివృద్ధి పనుల్ని వేగంగా చేపట్టాలని, ఏఈలు ప్రత్యేక బాధ్యత తీసుకొని పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో నాడు నేడు పనుల పురోగతిపై ఈఈల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం తరగతులు జరుగుతున్నందున విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రధానోపాధ్యాయులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. 15వ ఫైనాన్స్, ఎన్.క్యాప్ నిధులతో పనుల్ని ఆయా ప్రాంత డీఈఈలు ప్రత్యేక శ్రద్ధతో వేగవంతం చేయాలని కమిషనర్ ఆదేశించారు. కాంట్రాక్టర్స్‌తో మాట్లాడి ఐలాండ్స్ పనుల్ని వేగవంతం చేయాలని చెప్పారు. విస్తరణ జరుగుతున్న ప్రాంతాల్లో పట్టణ ప్రణాళిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా చూడాలని తెలిపారు. ఏఈలు తమ పరిధిలో ఎక్కడా తాగునీటి సమస్యలు రాకుండా పర్యవేక్షణ చేయాలని, సచివాలయాల వారీగా కూడా ఎమినిటీ కార్యదర్శులు పైప్‌లైన్ లీకులు, కలుషిత నీటి సరఫరాపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. సమావేశంలో ఎస్ఈ భాస్కర్, ఈఈలు సుందరరామిరెడ్డి, శాంతిరాజు, కొండారెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్‌బీకేల సేవలపై డాక్యుమెంటరీ



డాక్యుమెంటరీ నిర్మాణం చేస్తున్న డాక్టర్ గురు చరణ్ బృందం

పెదకాకాని: రైతు భరోసా కేంద్రం ద్వారా అన్నదాతలకు అందిస్తున్న సేవలపై డాక్యుమెంటరీ చేసి ప్రభుత్వానికి అందించనున్నట్లు స్కోచ్ గ్రూప్ సంస్థ వైస్ చైర్మన్ డాక్టర్ గురు చరణ ధనుంజయ్ అన్నారు. మండల పరిధిలోని నంబూరు గ్రామ ఒకటో సచివాలయం, రైతు భరోసా కేంద్రాల్ని బుధవారం స్కోచ్ గ్రూప్ సంస్థ ప్రతినిధులు సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలపై రైతులతో సమావేశమయ్యారు. కేంద్రాల ద్వారా ఎరువులు, నాణ్యమైన విత్తనాలు అందిస్తున్నట్లు రైతులు తెలియజేశారు. వీటితో పాటు సున్నా వడ్డీ పంట రుణాలు, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట గిట్టుబాటు ధరలకు కొనుగోలు వంటి ప్రయోజనాలు చేకూరుతున్నాయని వివరించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా లాభసాటి వ్యవసాయం చేసే విధంగా రైతులకు అందిస్తున్న సేవలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా వారికి చేకూరుతున్న ప్రయోజనాలపై అధికారులతో సంస్థ ప్రతినిధులు చర్చించారు. ఈ సన్నివేశాలను వీడియో షూట్ చేసి ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్కోచ్ సంస్థ ఎనలిస్ట్ శివం చౌదరి, పరిశోధనాధికారి క్రునాల్ రైనా, సినిమాటోగ్రాఫర్ పవన్ గుడే, జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎం. విజయ భారతి, ఏపీ సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ శేఖర్‌బాబు, మండల వ్యవసాయ అధికారి పి. సంధ్యారాణి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు బి. బాబూరావు,అఖిల,త్రివేణి, హేమంత్, రైతులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల ద్వారా రైతులకు ఉత్తమ సేవలు

వేజండ్ల (చేబ్రోలు): రాష్ట్రంలో ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన రైతు భరోసా కేంద్రాలు అన్నదాతలకు అన్ని విధాలా అండగా నిలుస్తున్నాయని జిల్లా వ్యవసాయశాఖాధికారి నున్నా వెంకటేశ్వర్లు తెలిపారు. చేబ్రోలు మండలం వేజండ్ల రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం స్కోచ్ అవార్డు బృందం పరిశీలించింది. ఆర్‌బీకేల్లో రైతులకు అందుతున్న సేవల గురించి డీఏవో వెంకటేశ్వర్లు బృందానికి వివరించారు. కియోస్క్ ద్వారా రైతులకు విత్తనం నాటిన దగ్గర నుంచి పంట విక్రయించుకునే వరకు అందిస్తున్న సేవలను ఆయన తెలియజేశారు. ఎరువులు, పురుగుమందులు, ఈ క్రాప్, ప్రకృతి విపత్తుల సమయంలో నష్టపరిహారం, పంట కొనుగోలు తదితర అంశాల గురించి స్కోచ్ అవార్డు బృందం తెలుసుకుంది. పొన్నూరు ఎంపీడీవో బి. బాబూరావు, ఏవో శ్రీనివాసనాయక్, స్థానిక రైతులు పాల్గొన్నారు.



రైతు భరోసా కేంద్రం వద్ద డీఏవోతో మాట్లాడుతున్న స్కోచ్ బృందం సభ్యుడు